క్లుప్తంగా

పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలి



బాన్సువాడ : ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు గంగాధర్ చారి అన్నారు. శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ఇందిరమ్మ ఇళ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో 5 శాతం వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు.కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు గొల్ల గంగాధర్‌యాదవ్, గంగారాం, మేఘమాల, సంగప్ప, బస్వరాజ్ తదితరులున్నారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేల భృతి ఇవ్వాలి



ఎల్లారెడ్డిరూరల్: ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ.12వేల భృతి ఇవ్వాలని ఆటో నిర్వాహకులు అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో వారు ఆటోర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోలకు ఉపాధి కరువైంద న్నారు. దీంతో రాష్ట్రంలో 83 మంది ఆటోల నిర్వాహకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఆటోల సంఘం రాష్ట్ర నాయకులు రవి కుమార్, సాయిలు తదితరులున్నారు.

ఇమ్యూనైజేషన్ పకడ్బందీగా చేపట్టాలి



బాన్సువాడ రూరల్ :ఏ ఒక్క చిన్నారి కూడా తప్పిపోకుండా ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. శనివారం ఆమె బాన్సువాడ మండలంలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌సెంటర్లను తనిఖీచేశారు. బోర్లం క్యాంపులో ఆమె మాట్లాడుతూ ప్రతి శనివారం, బుధవారం ఇమ్యూనైజేషన్ చేపట్టాలన్నారు. టీకాలను పరిశీలించి వాటి గడువు తేదిలను పరిశీలించారు. గర్భిణీ, బాలింతలు, చిన్నారుల టీకాల విషయంలో అలసత్వం వహించరాదని, వారికి అందుతున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దయానంద్, ఆరోగ్య కార్యకర్త అనురాధ, యశోద, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆశ వర్కర్ కురుమ పద్మ, తదితరులున్నారు.

దోమకొండ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం


మనోహర్

దోమకొండ: దోమకొండ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడుగా చెన్నం నారాయణ, గౌరవ కార్యదర్శిగా లింగ సిద్దరాములు, అధ్యక్షుడుగా క్యాడిప్యాక మనోహర్, కార్యదర్శిగా పాత వెంకయ్య, ఉపాధ్యక్షుడుగా పారిపెల్లి సురేష్, కోశాధికారిగా చింతల వెంకన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి రోగులు భారీగా వచ్చారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ రేణుక చౌహాన్, మాజీ జడ్పీటీసీ సభ్యులు తానాజీరావు, శంకర్ నాయక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 10 మంది ప్రత్యేక వైద్యులు రోగులను పరీక్షించారు. 583 మంది రోగులను పరీక్షించారు. గాంధారి మాజీ సర్పంచ్ సత్యం, మాజీ సర్పంచ్ సంజీవు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మెరుగైన లాభాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విత్తన శుద్ధితో పంటల సాగులో మెరుగైన లాభాలు ఆర్జించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు సూచించారు. శనివారం మండలంలోని మర్కల్ గ్రామంలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. . రైతులు స్వయంగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్లలో కనీస వసతులు కరువు

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు
- మద్నూర్, తాడ్వాయిల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేయించాలని వినతి


నిరుపయోగంగా మారిన తాడ్వాయి బస్టాండ్

మద్నూర్/తాడ్వాయి : ప్రయాణ ప్రాంగణాలు అలంకరప్రాయంగా మారాయి. బస్టాండ్లలో కనీస వసతులు కరువయ్యాయి. మద్నూర్‌లో 1989లో నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ప్రారంభంలో అన్ని వసతులతో బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. ప్రతిరోజు బస్టాండ్‌లోకి బస్సుల వివరాలను రాసుకునేందుకు కంట్రోలర్‌ను కూడా నియమించారు. కాలక్రమంలో బస్టాండ్‌లో లైట్లు, విద్యుత్ మీటర్, ప్రయాణికులు కూర్చోవడానికి నిర్మించిన గద్దెలు ధ్వంసమై సమస్యలు రెట్టింపయ్యాయి. దీంతో అది శిథిలావస్థకు చేరింది. బస్టాండ్‌లో ఉన్న టాయిలెట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి అక్కడ చెట్లు పెరిగిపోయాయి. బస్టాండ్‌ను చూసిన ప్రయాణికులు బస్టాండ్‌లోనికి రాకుండానే బస్సు ఎక్కుతున్నారు. దీంతో గత 20 ఏళ్లుగా బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లడమే పూర్తి మానేశారు. అలాగే తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. అందులో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో బస్టాండ్‌లు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబుల అడ్డాగా మారుతున్నాయి. నిరుపయోగంలో ఉన్న బస్టాండ్‌లను బాగుచేయడం లేదని పలు గ్రామాల ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని బస్టాండ్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని వివిధ గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.


తాడ్వాయిలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు


మద్నూర్‌లో నిరుపయోగంగా.. ఆర్టీసీ బస్టాండ్


విరిగిపోయిన ప్రయాణికులు కుర్చునే దిమ్మలు

సమస్యను పరిష్కరించాలి



మద్నూర్ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యను అధికారులు పరిష్కరించాలి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపైనే బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళ బస్టాండ్‌లో లైట్లు వెలగడం లేదు. 20 ఏళ్లుగా బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లడం లేదు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. –గణేష్, మద్నూర్

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు



తాడ్వాయి బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా మారింది. లక్షలాది రుపాయలు వెచ్చించి బస్టాండులు నిర్మిస్తే అధికారులు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు చొరువ తీసుకొని మరమ్మతులు చేయించాలి. ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. – లక్ష్మణ్, తాడ్వాయి

బస్టాండ్ గోడలు శిథిలావస్థకు చేరాయి



బస్టాండ్‌లో కనీసం కూర్చోడానికి దిమ్మెలు లేకుండా పోయాయి. బస్టాండ్ గోడలు శిథిలావస్థకు చేరాయి. గురయ్యాయి. ప్రయాణికుల అవసరాల మేరకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలి. బస్సుల వివరాలను రాసుకునేందుకు కంట్రోలర్‌ను నియమించాలి. బస్టాండ్‌కు రక్షణగా వాచ్‌మెన్‌ను నియమించాలి. –శ్రీకాంత్, పెద్ద ఎక్లార

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం



బస్టాండ్ లోకి బస్సులు రాకపోవడంతో రోడ్లపైనే బస్సుల కోసమే నిల్చుని ఎదురుచూస్తున్నాం. దీంతో ఎండ, వాన కాలాల్లో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. హోటళ్లు, దుకాణాలలో కూర్చోవలసి వస్తుంది. ప్రభుత్వం మహిళల కోసం ఫ్రీబస్సు పథకం ప్రవేశ పెట్టింది, కాని బస్టాండులను మాత్రం బాగు చేయిస్తా లేదు. –గోపి, తాడ్వాయి

పేదల సొంతింటి కల నెరవేర్చాం

- వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ : నియోజకవర్గంలోని పేదల సొంతింటి కల నెరవేర్చామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడలోని తన నివాసంలో బీర్కూర్‌కు చెందిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 మంది లబ్ధిదారులకు రూ.37.71 లక్షల బిల్లు చెక్కులు అందజేమన్నారు. గత ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించామన్నారు.మాజీ ఎంపీపీ రఘు, నాయకులు బోయిని శంకర్, శశికాంత్, ఆరీఫ్, యామ రాములు, సందీప్, రఘు, మన్నన్ తదితరులు ఉన్నారు.


బిల్లులు అందుకున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రజతోత్సవ సభకు తరలిరావాలి


లింగంపేటలో మాట్లాడుతున్న సురేందర్


వాజిద్‌నగర్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): వరంగల్‌లోని ఎల్కతుర్తి వేదికగా ఆదివారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నాయకులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు. ఆయన లింగంపేట మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడారు. మండలం నుంచి 500 మందిని తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సభకు వచ్చే వారికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు రమేశ్, ముదాం సాయిలు, బాలకిషన్, భూపతి, సాయిరాం, పర్వయ్య, సంగయ్య, గంగారాం తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభ పోస్టర్ల ఆవిష్కరణ

బిచ్కుంద/పిట్లం/నస్రుల్లాబాద్/మాచారెడ్డి: బిచ్కుంద మండలం వాజిద్‌నగర్‌లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారన్నారు. అలాగే పిట్లం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్లను బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు విజయ్, నాయకులతో కలిసి ఆవిష్కరించారు.బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నస్రుల్లాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లే ముందు ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు జెండా ఎగురవేసి బయలు దేరి వెళ్లాలని పార్టీ మాచారెడ్డి మండల అధ్యక్షుడు బాల్ చంద్రం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రజతోత్సవ సభకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట(ఎల్లారెడ్డి): భూ సమస్యలు పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చిందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన అన్నారు. శనివారం లింగంపేట మండలం కంచుమల్, కొండాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. భూభారతిపై గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ సమస్యలను దరఖాస్తులో స్పష్టంగా రాసి అధికారులకు అందజేయాలని సూచించారు. సమస్యను క్షుణంగా విచారించి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల వివాదాలను ఇరు శాఖల అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ కిరణ్, ఎఫ్‌ఆర్‌వో ఓంకార్, అధికారులు, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

త్రిశక్తి ఆలయానికి విరాళం అందజేత



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన వేదపండితులు గంగవరం ఆంజనేయశర్మ దంపతులు తమ 33వ పెళ్లి రోజు సందర్భంగా శనివారం స్థానిక త్రిశక్తి ఆలయానికి రూ. 25వేల విరాళం అందజేశారు. ఇది వరకు లక్ష రూపాయలు విరాళం అందజేసి, మళ్లీ రూ.25వేలు అందజేయడంపై ఆలయ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా త్రిశక్తి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు.భక్తి, శ్రద్ధలతో పాటలు పాడుకుంటూ ఆలయం చుట్టూ తిరుగుతూ చావ తీశారు.

హనుమాన్ ఆలయం వద్ద హోమం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి గ్రామ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం యజ్ఞ, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం జరిగి నలభై రోజులైన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఏముల కాశీరాం, రాజు, కుర్మ.రవి, కృష్ణ, సాయిలు తదితరులున్నారు.

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్, కోమట్‌పల్లి గ్రామాల్లో శనివారం ఎంపీడీవో నరేష్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికి వెళ్లి విచారణ చేశారు. విచారణ అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన మంజుల అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు ఆపరేషన్ నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రెండున్నర లక్షల రూపాయల ఎల్‌వోసీ చెక్కును బాధితకుటుంబ సభ్యులకు అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

అపూర్వ విద్యార్థుల సమ్మేళనం


గోపాల్‌పేట హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో గోపాల్‌పేట హైస్కూల్‌లో శనివారం 2005–06లో పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు ఇరవైయేళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దీంతోపాటు గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, రాంమూర్తి, గులాం అహ్మద్, వెంకటరమణ, మాణిక్యం, మహేష్‌గౌడ్, నాగేశ్వరావు, పద్మావతి, నరేష్ తదితర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న టీఎన్జీవోస్ ప్రతినిధులు


రామేశ్వర్‌పల్లిలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..


నాగిరెడ్డిపేటలో ..

కామారెడ్డి టౌన్/భిక్కనూరు/నాగిరెడ్డిపేట: జమ్మూకాశ్మీర్‌లోని పహల్ గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తుల ప్రదర్శనలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ముందు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే కామారెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్(క్రెడా) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సాయిలు, నాగరాజు, నర్సాగౌడ్ తదితరులున్నారు.

అలాగే భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక భారతమాత విగ్రహం వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం పాకిస్తాన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అలాగే నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఇమామ్, గులామ్, సుధాకర్, షాహెద్‌పాష పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలుకేంద్రం ప్రారంభం


జొన్నల కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ సహకారసంఘం ఆధ్వర్యంలో శనివారం మెల్లకుంటతండాలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, సహకారసంఘం చైర్మన్ గంగారెడ్డి జొన్నల కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలుకేంద్రంలో విక్రయించిన క్వింటాల్ జొన్నలకు రూ.3,371 చెల్లిస్తామన్నారు.సహకారసంఘం వైస్‌చైర్మన్ బాబురావు, డైరెక్టర్లు సంగయ్య, హనుమనాయక్, సీఈవో చంద్రమురళి, నాయకులు రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వరోజ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాలపై విచారణ


గోర్గల్‌లో కొనుగోలు కేంద్రం వద్ద విచారణ చేపడుతున్న అధికారులు

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాలపై శనివారం సహకార సంఘం క్లస్టర్ అధికారి మురళిధర్‌గౌడ్, మానిటరింగ్ అధికారి కరుణాకర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సదరు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని బస్తాకు 42 కిలో చొప్పున తూకాలు చేస్తున్నట్లు గుర్తుతెలియని వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో సహకార క్లస్టర్ అధికారితో పాటు మానిటరింగ్ అధికారి కొనుగోలు కేంద్రంలో విచారణ చేపట్టారు. ధాన్యం శుభ్రం చేయకుండానే బస్తాకు 42 కిలోల చొప్పున తూకానికి రైతులందరి సమ్మతం మేరకు విక్రయాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. సదరు ధాన్యం తూకాల్లో సొసైటీ సిబ్బందికి ఎటువంటి ప్రమేయం లేదని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు విచారణ నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామని అధికారులు తెలిపారు. వారి వెంట సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్, రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట, వెల్లుట్ల, అన్నాసాగర్, లింగారెడ్డిపేట గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రేమ్ కుమార్ శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

ధాన్యం రవాణా వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: ధాన్యం రవాణా వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట, లక్ష్మాపూర్, అడివిలింగాల గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ కార్యదర్శి విశ్వనాథం తదితరులున్నారు.

రూ. 2లక్షల చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న గంప గోవర్ధన్

దోమకొండ: మండలంలోని అంబారిపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందజేశారు. గ్రామానికి చెందిన కుంట నాగరాజు గతేడాది కరెంట్ షాక్‌తో మృతి చెందారు. పార్టీ తరపున మంజూరైన చెక్కును శనివారం మృతుడి భార్య బాలమణికి ఆయన అందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ సలీం, గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాలో అంతరాయం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ సబ్‌స్టేషన్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. హెడ్‌స్లూయిస్ సబ్ స్టేషన్ నుంచి పిట్లం సబ్ స్టేషన్ వరకు ఫీడర్ లైన్ మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీంతో మల్లూర్ సబ్ స్టేషన్, నర్సింగ్‌రామ్‌పల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని మల్లూర్, మల్లూర్‌తాండ, వడ్డేపల్లి, వడ్డేపల్లితాండ, జక్కాపూర్, నర్సింగ్‌రామ్‌పల్లి, మంగ్లూర్, వెల్గనూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.